

(గత సంచిక తరువాయి)

ఖాలెద్ కొనసాగించాడు.

"శుక్రవారం ప్రేయర్ తర్వాత పోలీసులుజరిపిన కాల్పుల్లో ఇద్దరు మరణించారు. చాలామంది గాయపడ్డారు. మర్నాడు మరణించినవారిని పాతిపెట్టగానే తిరిగి నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. మళ్ళీ వారిమీద కాల్పులు జరిగాయి. తుపాకీ గుళ్ళగాయాలతో హాస్పిటల్‌కి వెళ్ళినవారిని అరెస్ట్ చేయసాగారు. దాంతో డేరాలోని అతి పాత మసీదు ఒల్మార్ మాస్క్‌ని ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌గా మార్చారు. ఓ తెల్లవారు ఝామున సెక్యూరిటీ ఫోర్సెస్ ఆ మాస్క్‌మీద దాడి చేసి, డాక్టర్స్‌తో సహా చాలామందిని కాల్చి చంపాయి. ఆగ్రహంతో చుట్టుపక్కల ఊళ్ళనించి కూడా వేలమంది డేరాకి చేరుకున్నారు. పరిస్థితి చెయ్యి జారిపోయిందని గ్రహించిన అధికారులు ఆ నలుగురు స్కూలు విద్యార్థులని విడుదల చేసారు. తమని పోలీసులు ఎలాంటి చిత్రహింసలకి గురిచేసారో పిల్లలు చెప్పాక, ఆ హింసాకాండ గుర్తులని వాళ్ళ ఒంటిమీద చూసిన ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. నిరసనలని ఆపలేదు. అందులో మహిళలు కూడా పాల్గొన్నారు. మళ్ళీ నిరసన కారులమీద పోలీసులు కాల్పులు జరిపారు. దారా నగరంలో పరిణతి చెందని ఓ స్కూల్ విద్యార్థి రాసిన స్లోగన్స్‌వల్ల తిరుగుబాటు ఆరంభమైంది. దాన్ని అణచివేయాలని అధ్యక్షుడు బషర్ అల్ అసాద్ ప్రయత్నించినా అది మరింత బలం పుంజుకుంది. జూలైకల్లా దేశం మొత్తంలో వేలమంది రోడ్లమీదకి వచ్చి నిరసన ప్రదర్శనలని నిర్వహించారు."

ఖాలెద్ చెప్పేది ఆపి లేప్‌టాప్‌లో ఆల్ జజీరా నలభై ఏడు నిమిషాల వీడియోని వివరిస్తూ ఫాస్ట్‌ఫార్వర్డ్ చేస్తూ చూపించాడు.

"మొబైల్ ఫోన్స్‌వల్ల సిరియన్ ప్రజలు అందరికీ దారాలో ఏం జరుగుతోందో తెలిసింది. తిరుగుబాటు ఉద్యమం కేవలం నలుగురు పిల్లల విడుదలగా కాక, సిరియా నేత అసాద్‌ని దించే తిరుగుబాటుగా మారింది. తిరుగుబాటు ఆరంభానికి ప్రజలంతా సంతోషించారు. అది లటాక్యా, అల్‌రీక్, అలెప్పో, డమాస్కస్ నగరాలకి పాకింది. దారా శివార్లలోని నైమా గ్రామం హింసకి ప్రసిద్ధి. అక్కడివారు చేసే తిరుగుబాటుని అణచివేయడానికి 18 అక్టోబర్ 2011న

ప్రభుత్వ సేనలు అందులోకి ప్రవేశించి, ఇళ్ళమీదకి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. అది సిరియాలో ఆయుధ పోరాటానికి నాంది అయింది. ఆ ఊళ్ళోని ఫైటర్ పైలెట్‌గా శిక్షణ పొందిన, అకౌంటెంట్ మరూఫ్ 'తిరుగుబాటు వీరుడు మరూఫ్'గా 1987లో మిలటరీ శిక్షణ పొందిన అతను యువకులకి మిలటరీ తర్ఫీదు ఇచ్చి, తమ ప్రెసిడెంట్ బసార్ అల్ – అసాద్‌ని నియంతగా నిందిస్తూ, పదవీచ్యుతుడ్ని చేయడానికి ఫ్రీ సిరియన్ ఆర్మీని సృష్టించి, ప్రభుత్వ సైనికుల మీద యుద్ధానికి దిగాడు. జనం, ఆయుధాలు తక్కువ కాబట్టి మొదట్లో అతనికి అది కష్టమైంది. దారాలో సిరియా తిరుగుబాటు అలా అనుకోకుండా ఆరంభమైంది."

ఇంటర్నెట్ ద్వారా దేశం బయట సిరియన్స్‌కి తమ దేశంలో జరిగేది తెలిసింది. చాలామందిలా దారాకి తన నిపుణతని వెంట తెచ్చాడు. దక్షిణ దారా బయట ఓ ఫామ్ బిల్డింగ్‌లో ఆయుధ ఫేక్టరీని స్థాపించాడు. చిన్న ఇంజనీరింగ్ కంపెనీలా పనిచేసే అందులో మైన్స్, రాకెట్‌లని తయారు చేసారు. దారామీద ప్రభుత్వం వేసిన పేలని బాంబులని సేకరించి అందులోని టిఎన్‌టి పేలుడు పదార్థాన్ని తీసి బాంబులని తయారుచేసారు. ఆడవాళ్ళు పిల్లలకి స్కూల్స్ నడిపారు. ఓ మహిళ పిల్లలకి సివిల్ డిఫెన్స్‌లో శిక్షణని ఇచ్చింది. బాంబ్ పడ్డాక అది పేలకపోతే శిథిలాల్లో వెదికి దాన్ని ముట్టుకోకుండా పిల్లలు తిరిగి పనికొచ్చేవి వెదికి భద్రంగా తీసుకువచ్చే శిక్షణ ఇచ్చారు.

ప్రతీరోజు దారామీద బాంబుల వర్షం కురిసి, యుద్ధం వారి గుమ్మం దగ్గరికి వచ్చింది. హెవీ షెల్లింగ్, బాంబులవల్ల దారా కాంక్రీట్ అస్థిపంజరంగా మారింది. చాలామంది భవిష్యత్‌ని కోల్పోయారు. 2013లో ఏర్ స్ట్రైక్‌లో తిరుగుబాటుకి కారణమైన విద్యార్థి మావ్యా తండ్రి మరణించాడు. పిల్లలు కూడా గోడలకి చెవులుంటాయని మాట్లాడకపోవడాన్ని నేర్చుకున్నారు. స్నైపర్స్ గుళ్ళు ఇళ్ళలోకి వెళ్ళి కిటికీ దగ్గర కదలిక కూడా చావుని తెచ్చేది .చాలామంది ఇళ్ళని వదిలి లెబనాన్, టర్కీ, జోర్డాన్‌లకి పారిపోయారు. సామాన్య ప్రజలు తోడై, ఆ తిరుగుబాటు సైన్యానికి వంటలు వండిపెట్టారు.

ఆ అర్బన్ గెరిల్లా వార్‌లో పాల్గొన్న యోధులంతా పిల్లలుగా ఆడుకున్న వీధులు కాబట్టి వారికి తెలిసినట్లుగా ఆ నగరం, దాని రోడ్లు వారితో పోరాడే ప్రభుత్వ సైన్యానికి తెలియదు. అసాద్‌కి మద్దతునిచ్చే రష్యన్, ఇరాన్, లెబనీస్ మిలిటెంట్ షియా గ్రూప్ హిజ్బుల్లాలు ఓ వైపు, మరోవపు అల్ – అసాద్‌ని గద్దె దింపాలనే గ్రూప్ రంగంలో ఉన్నాయి. క్రమంగా ఆ యుద్ధం అసాద్‌కి వ్యతిరేకంగా, లేదా అనుకూలంగా జరగడం ఆగిపోయి, సున్నీ, షియాల్ అమధ్య పోరాటంగా మారింది. ఇస్లామిక్ స్టేట్‌ని స్థాపించాలని చూసే ఐసిస్ జిహాదిస్ట్‌లు రంగప్రవేశం చేసారు.

"నీకు విసుగు పుట్టకపోతే చెప్తాను" ఖాలెద్ చెప్పాడు.

"నేర్చుకోవడం ఆపేసినవాడి వయసు ఇరవై ఐనా, ఎనభై ఐనా వృద్ధుడే. నేర్చుకుంటూండేవాడు ఎప్పటికీ యంగే అని హెన్రీ ఫోర్డ్ చెప్పాడు. అవునా అక్కా?" ఆద్య నవ్వుతూ అక్కవంక చూసింది.

"ఎదిగావన్నమాట. కంగ్రాచ్యులేషన్స్" చైత్ర కూడా నవ్వుతూ చెప్పింది.

"అసలు ఐసిస్ ఎలా ఆరంభమైంది?" ఆద్య అడిగింది.

ఖాలేద్ లేప్‌టాప్‌లో ఫోటోలని కర్సర్‌తో చూపిస్తూ వివరిస్తూంటే ఇద్దరూ ఆసక్తిగా చూసారు.

"ఐసి అంటే ఐ.ఎ.స్.ఐ.ఎస్. ఇస్లామిక్ స్టే ఆఫ్ ఇరాక్ అండ్ సిరియాకి షార్ట్ ఫామ్. మిడిల్ ఈస్ట్ దేశం జోర్డాన్‌లో మార్చ్ 1999లో ఐసిస్‌కి నాంది పడింది. ఇతను జోర్డాన్ కింగ్ హుస్సేన్ బిన్ తలాల్. ఇతను ఆయన తమ్ముడి కొడుకు. నిజానికి ఇతను వారసుడవ్వాలి. కాని హుసేన్ మనసు మార్చుకుని మరణానికి మునుపు తన కొడుకు అబ్దుల్లాని తర్వాతి రాజుగా ప్రకటించాడు. అబ్దుల్లా కఠినమైన మిలటరీ మేన్. అతనికి రాజకీయాలు తెలియవు. బేరక్స్‌లోని రఫ్ లైఫ్, ఫాస్ట్ కార్లంటే ఇష్టం. రాజు సింహాసనం ఎక్కాక రాజకీయ ఖైదీలకి క్షమాభిక్ష పెట్టడం జోర్డాన్ సంప్రదాయం. దాంతో విడుదల చేయాల్సినవారిని నిర్ణయించడానికి పార్లమెంటరీ బోర్డ్‌ని ఏర్పాటు చేసాడు. రెండున్నర వేల పేర్లని అబ్దుల్లా నిర్ణయం కోసం ఆ కమిటీ ఇచ్చింది. సెక్యూరిటీ ఏజన్సీలు వద్దని సలహా ఇచ్చినా, అనేక రాజకీయ పార్టీలని, కక్షిదారులని సంతృప్తి పరచడానికి అబ్దుల్లా అమాయకంగా ఇస్లామిస్ట్ ఉగ్రవాదులని విడుదల చేసాడు. వారిలోని ఒకరు అహ్మద్ ఫదీల్ అల్‌నజల్ అల్ ఖలేలే లేదా అబు ముసాబ్ అల్ జర్‌ఖలీ. ఇతను మిలిటెంట్. ఇంత పెద్ద పేరున్న యితన్ని జర్‌ఖలీ అని పిలుచుకుందాం. ఆఫ్ఘన్, సోవియెట్ యుద్ధంలో ఇతను ఉగ్రవాది. విడుదలయ్యాక ఇతను జోర్డాన్‌ని భద్రమైన దేశంగా భావించక దాన్ని వదిలి పాకిస్థాన్‌కి వెళ్ళిపోయాడు. పాకిస్థానీస్ ఎక్కువ కాలం తమ దేశంలో ఇతన్ని ఉండనివ్వకపోవడంతో ఆఫ్ఘనిస్థాన్‌కి వెళ్ళి ఒసామా బిన్ లాడెన్‌ని కలిసాడు."

"ఆయనెవరో తెలుసా?" వెంటనే చైత్ర చెల్లెల్ని అడిగింది.

"విన్నాను."

"ఆద్యకి తెలీదు, ఆమె పరిజ్ఞానం హైద్రాబాద్‌లోని ఫ్రెండ్స్, పబ్స్, ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్లు, తెలుగు సినిమాలే తప్ప ప్రపంచ విషయాలమీద ఆమెకి ఎలాంటి అవగాహనా లేదు. “

“ఐతే జర్‌ఖలీ స్వేచ్ఛాభావాలు గలవాడు. బిన్ లాడెన్ ఆజ్ఞలని పట్టించుకునేవాడు కాదు .దాంతో బిన్ లాడెన్ అతన్ని సిరియాలోని లవెంట్ ప్రాంతానికి ఇన్‌ఛార్జ్‌గా పంపించాడు. లవెంట్ జోర్డాన్, లెబనాన్, ఇజ్రాయిల్, సిరియా, టర్కీ, పాలస్తీనా టెరిటోరీలకి చెందిన చాతిత్రాత్మక ప్రాంతం."

ఆ మేప్‌ని చూపించి మళ్ళీ ఖాలెద్ కొనసాగించాడు.

"ఇతను ఇస్లామిక్ ప్రపంచం నించి ఉగ్రవాదులని రప్పించసాగాడు. జర్‌ఖలిని బిన్ లాడెన్ 2004 ఇరాక్‌లో నేతని చేసాడు. అతనివల్ల ఇరాక్ అల్‌ఖైదా బ్రాంచ్‌లో చాలామంది ఉగ్రవాదులు చేరి అల్‌ఖైదా బలపడింది. మీకు గుర్తుంటే

జోర్డాన్‌లోని అమెరికన్ రాయబారి లారెన్స్ షాలీని చంపింది జర్ఖలీనే. అమెరికన్ జర్నలిస్ట్ నిక్‌బెర్గ్ తలని నరికించి ఆ వీడియోని యూట్యూబ్‌లో పెట్టాడు. అమెరికా జర్ఖలీ తలమీద రెండున్నర కోట్ల డాలర్ల బహుమతిని ప్రకటించింది."

"మొదటి ఇరాక్ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌లమీద బాంబింగ్ చేస్తానని జర్ఖలీ బెదిరించాడు కదా?" చైత్ర అడిగింది.

"అవును. ఫలితంగా సున్నీ మైనారిటీల్లోని రెండు శాతం మంది మాత్రమే ఓట్లు వేసారు. జర్ఖలీ షియా ముస్లిం. సున్నీలంటే ద్వేషం. అల్లా తనని ముస్లిం రాజ్యస్థాపనకి ఎన్నుకున్నాడని అతను నమ్మాడు. ఛాందసం ముస్లింలు కూడా దాన్ని నమ్మారు. ఇస్లామిక్ స్టేట్ రాజధానిగా సిరియాలోని రాకోని ప్రకటించాడు. రాకోమీద రష్యన్ ఎయిర్‌ఫోర్స్ జనవరి 2016లో ఏర్ అండ్ క్రూజ్ మిస్సైల్స్‌ని ప్రయోగించింది. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు గ్రామాలని ఆక్రమించి తామే పాలించసాగారు. అమెరికన్ మద్దతుదార్ల హింస అధికమై, స్కూల్స్, హాస్పిటల్స్ మీద బాంబు దాడులు జరిగాయి. అమెరికన్ స్నైపర్స్, మైన్‌ఫీల్డ్‌ల భయంతో సివిలియన్స్ ఇనప మృత్యుగృహంలాంటి రాకో నగరం నించి పారిపోసాగారు. ఆ నరకంలో చిక్కుపడ్డ పాతిక వేలమందిలో సగం మంది పిల్లలు.

"పేరుకే బిన్ లాడెన్ కింద పనిచేసేవాడు తప్ప, జర్ఖలి పర్సనాలిటీ కల్ట్‌ని అభివృద్ధి చేసుకుని నాయకుడిగా స్థిరపడ్డాడు. తన సంస్థకి అతను చెడ్డపేరు తెస్తున్నాడని బిన్ లాడెన్ గ్రహించి ఏం చేయలేకపోయాడు. షతె మసీదులని బాంబ్ చేసి, వారిని మతభ్రష్టులుగా ప్రకటించాడు. 2005లో జోర్డాన్‌లోని అమ్మన్‌లోని రాడిసన్ హోటల్లో బాంబ్ దాడి చేసి, పెళ్ళికి హాజరైన అరవైమంది సున్నీలని చంపాడు. అది ఇరాక్‌లో సున్నీలు, షియాలమధ్య ప్రచ్ఛన్నయుద్ధానికి దారితీసి వేలాదిమంది మరణించారు .అమెరికన్స్ స్పై డ్రోన్స్‌తో అతనికోసం వెదికి, చివరికి 2006లో అతని ఇళ్ళల్లోని ఓ దానిమీద బాంబింగ్ చేసి అతన్ని చంపారు. నాలుగు నెలల తర్వాత ఇరాక్ అల్‌ఖైదానించి ఐసి పుట్టింది. ఇదంతా అనుభవంలేని ఓ రాజు సంతకం చేసిన ఓ క్షమాభిక్షనించి పుట్టి, వేలమంది ప్రాణాలని బలి తీసుకుంది. ఐసిస్ అలా మా సిరియాలో జోక్యం చేసుకుంది."

అతని కంఠంలోని ఆవేదన అక్కాచెల్లెళ్లకి అర్థమైంది.

"వారికి మద్దతునిచ్చే విదేశీ శక్తులు కూడా రంగప్రవేశం చేసాయి. సిరియాలో చమురు బావులు చాలా ఉన్నాయి. ఎక్కడ చమురుంటే అక్కడ అగ్రరాజ్యాలు జోక్యం చేసుకుంటాయి. రష్యా, అమెరికాలు తమ బలాబలాలని ప్రదర్శించుకోసాగాయి. చిత్రం చూసారా? సిరియాని ఆధీనంలోకి తెచ్చుకోవాలని అనేక గ్రూపులు యుద్ధం చేసుకోసాగాయి. దేశంలోని కొంత భాగం ఐసిస్ ఆధీనంలోకి, కొంత భాగం ప్రభుత్వ ఆధీనంలోకి కొంతభాగం తిరుగుబాటుదారుల ఆధీనంలోకి, మరికొంత భాగం హిజ్బుల్లా ఆధీనంలోకి, కొంత భాగం స్వతంత్ర దేశం కోరుకునే కుర్దిష్‌ల ఆధీనంలోకి వెళ్ళిపోయింది. ఈ హింసాకాండనించి తప్పించుకోవాలని టర్కీకి ఇరవై మూడు లక్షలమంది,

లెబనాన్‌కి పది లక్షలమంది, జోర్డాన్‌కి ఆరు లక్షల ముప్పైవేలమంది సిరియన్స్ వలస వెళ్ళిపోయారు. అంటే మొత్తం సగం మంది సిరియన్స్ దేశం విడిచి పారిపోయారు. ఐసిస్ ఉగ్రవాదులు పిల్లలకి ఆటబొమ్మలని ఇచ్చి, వాటి స్విచ్‌ని నొక్కినప్పుడల్లా బక్లావాని ఇచ్చేవారు. తర్వాత బాంబ్స్ అమర్చిన ఆటబొమ్మలని ఇచ్చి, శత్రు సైనిక శిబిరాల్లో వాటి స్విచ్‌లని నొక్కమని, బక్లావా ఇస్తారని చెప్పి పంపేవారు. ఐదారేళ్ళ పిల్లలకి ఆ ప్రమాదం తెలీదు. వాళ్లని ఎవరూ అనుమానించరు."

"దారుణం! పరమ దారుణం!!" ఆద్య బాధగా చెప్పింది.

"ఏభైవేలమంది పిల్లలు ఆ తిరుగుబాటులో మరణించారు. ఖతార్, సౌదీ అరేబియా, పొరుగున ఉన్న లెబనాన్, ఇరాక్, టర్కీ ఇంకా చాలా దేశాలు కూడా సిరియాలోకి ప్రవేశించి చివరికది అంతర్జాతీయ బేలన్స్ ఆఫ్ పవర్ స్ట్రగుల్‌గా మారింది. సిరియాలోని పెద్ద నగరాలైన హోమ్స్, డెమాస్కస్, హమా, లటాకియాలాంటి నగరాలన్నిటిని 2016కల్లా తమ ఆధీనంలోకి తీసుకున్న తిరుగుబాటుదారులు అల్ అసాద్ ఆధీనంలోని మరో పెద్ద నగరం అలెప్పోని దిగ్బంధం చేసారు. దాన్ని కూడా వారు పట్టుకోగలిగితే యుద్ధం పూర్తయ్యేది. అమెరికావైపున్న సంకీర్ణ బృందాలు అలెప్పోమీద బాంబుల దాడిచేసి పొరపాటున జరిగిందని చెప్పాయి. సిరియన్ ప్రాక్సీ వార్‌లో చిన్న తప్పటడుగు వేసినా అది మూడో ప్రపంచ యుద్ధానికి, న్యూక్లియర్ వార్‌కి దారి తీయవచ్చని ప్రపంచం భయపడింది."

"మనం చాలా శాంతియుత దేశంలో ఉన్నందుకు నాకు చాలా ఆనందంగా ఉందక్కా" ఆద్య చెప్పింది.

"సారీ?" ఖాలెద్ అడిగాడు.

దాన్ని ఆద్య ఇంగ్లీష్‌లో చెప్పింది.

"అలెప్పోలో నా బంధువులు చాలామంది ఉన్నారు. ఆహారం లేక నా మేనమామ కుటుంబం చెట్ల ఆకులని కోసి, వాటిని కాచిన నీళ్ళని తాగి, గుజ్జుని తిని ఆకలిని చంపుకున్నారు. నగరంలో కొన్ని చోట్ల మాత్రమే రోజుకి మూడు గంటల విద్యుత్ సరఫరా. నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దాంతో డ్రైనేజ్ సౌకర్యం లేదు. 'ఎలుకల బోను అర్జెంట్‌గా కావాలి. ఇంట్లో చాలా ఎలుకలు తిరుగుతున్నాయని' చాలామంది మిత్రులకి ఈ మెయిల్స్‌ని పంపారు. ఆ అంతర్యుద్ధంలో అలెప్పోనించి డెబ్భై వేలమంది సిరియన్స్ పారిపోయి టర్కిష్ సరిహద్దుల్లోకి చేరుకున్నారు. సిరియా – టర్కీ సరిహద్దులో ముప్పైవేలమంది సిరియన్స్ నీరు, తిండి, కప్పు లేక చల్లటి టెంపరేచర్‌లో ఆ దేశంలోకి వెళ్ళడానికి అనుమతి కోసం పడిగాపులు పడుతూ నానా అవస్థలు పడ్డారు. అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ ప్రకారం 2011నించి టర్కీ పాతిక లక్షలమంది సిరియన్స్‌ని తీసుకుంది. జోర్డాన్ కొంతమంది కాందిశీకులని తీసుకుంది. పాకిస్థాన్ ఎక్కువమంది కాందిశీకులని స్వీకరించింది."

"మానవ హక్కులని అధికంగా కాలరాసే పాకిస్థాన్ కాందిశీకుల విషయంలో గుడ్ బాయ్ అన్నమాట" చైత్ర నవ్వింది.

"మెడిటరేనియన్ సీ దాటి యూరప్‌కి చేరుకోవడం ప్రమాదకరమైన ప్రయాణమైనా చాలామంది సిరియాలోని నరకం కన్నా పరాయిదేశంలోని స్వర్గమే ఉత్తమం అనుకుని చిన్న రబ్బర్ పడవల్లో సమీపంలోని గ్రీస్‌కి పారిపోయారు. చాలా పడవలు దారిలో మునిగిపోయి వారు మరణిస్తున్నారని తెలిసినా 'అది నాకు జరగదు' అనే మొండి ధైర్యంతో, నమ్మకంతో ప్రజలు పారిపోసాగారు. పడవల్లో పంపుతామని డబ్బు తీసుకుని మోసం చేసినవారు కూడా ఉన్నారు. అవి టర్కీ, గ్రీస్‌ల మధ్య ఎక్కువ మునిగాయి. అలా పారిపోయిన నా అంకుల్ కుటుంబంలోని ఏడుగురిలో ఆయన కొడుకు, భార్యా, కూతురు మాత్రం తప్పించుకుని మిగిలిన అంతా మరణించారు. ఆ పడవ కెపాసిటీ ముప్పై రెండు. కాని ధనదాహంతో అరవై ఐదుమందిని ఎక్కించడంతో పడవ బయలుదేరిన అరగంటకే మునిగిపోయింది" ఖాలెద్ బాధగా చెప్పాడు.

ఆ కుటుంబ సభ్యుల ఫోటోని చూపించాడు. కొద్ది క్షణాల తర్వాత కొనసాగించాడు.

"నా కజిన్ నలభై రెండేళ్ళ మశిర్ అస్ఫోర్ ఇడ్లిబ్‌నించి గ్రీస్‌లో ఇడోమెనా కాందిశీకుల శిబిరానికి ఎలాగో చేరుకున్నాడు. ఇలియాస్ పాపడోపోలోస్ అనే ఇంజనీర్ వారికి తమ వారితో కమ్యూనికేట్ చేయడానికి ఉచిత వైఫై సేవని ఓ పాత వాహననించి ఐదువేల యూరోలు వెచ్చించి అందించాడు. అది వెయ్యిమందికి మాత్రమే కనెక్షన్‌ని ఇవ్వగలదు. కేంప్ కెపాసిటీకి ఎనిమిది రెట్లమంది, పదిహేను వేలమంది కాందిశీకులు ఉన్నారు. నా కజిన్ అతి కష్టం మీద డబ్బు పంపమని నాకు ఈమెయిల్ పంపాడు. పక్కనించి వెళ్ళే ఓ లారీలోంచి గుడ్లు, బ్రెడ్‌ని విసిరితే ఎగబడ్డాడు. కాని దొరకలేదని, సిరియన్ అంతర్యుద్ధం సిరియాలోని ధనవంతులని పరాయిగడ్డమీద బిచ్చగాళ్ళుగా మార్చిందని రాసాడు. కాందిశీకులు తమ దేశాల్లోకి రాకూడదని యూరప్‌లోని దేశాల మధ్య సరిహద్దులు మూసేయడంతో వాటిని తెరుస్తారనే ఆశతో వేచి చూడసాగారు.'నేనున్నది మట్టినేలలో' అని ఈ మెయిల్లో చెప్పాడు."

అతను పంపిన ఫోటోలని అక్కాచెల్లెళ్ళిద్దరూ చూసారు. అట్టపెట్టెల్లో పడుకోబెట్టిన వారాల వయసుకల పసికందులు. వరసగా రెండు రోజులు కురిసిన వర్షంవల్ల టెంట్లలోకి వచ్చిన నీళ్ళల్లో, ఒంటికి ప్లాస్టిక్ బేగ్స్‌ని చుట్టుకుని బురద నేలమీద నిద్రపోతున్న మనుషులు. ఆ బురదలో నవ్వుతూ ఆడుకునే అమాయక పిల్లలు.

"ఆ శిబిరంలోని నలభై శాతం మంది పిల్లలు. నా కజిన్ భార్య, కూతురు వరసగా రెండు రోజులు ఆపకుండా ఏడుస్తూనే ఉన్నారని, అసలు మనిషి అంతకాలం ఏడవగలడని తనకి తెలీదని మశిర్ రాసాడు."

"తీవ్ర నిరాశలో అది సాధ్యమే" ఆద్య వెంటనే చెప్పింది.

"చలినించి కాపాడుకోడానికి రాత్రుళ్ళు ప్లాస్టిక్ బేగ్స్, కలప, పాతబట్టలు, ఇలా ఏవి దొరికితే వాటితో చలిమంట వేయడంవల్ల రేగిన పొగకి పిల్లల్లో శ్వాసకోశ సమస్యలు రేకెత్తాయి. ఆ కండిషన్స్‌లో పిల్లల్లో అంటు వ్యాధులు ప్రబలాయి. చాలామంది కోల్పోయింది నగదో, ఆస్తో, ఆరోగ్యమో కాదు. హృదయానికి సంబంధించినవి కోల్పోయారు. 'నాకు అలెప్పోలో నాలుగున్నర కోట్ల పౌన్ల ఇల్లు, పన్నెండు ఎకరాల పొలం, బంగారం ఉన్నాయి. ఐనా ఎగ్స్ కోసం ఇతరులని పక్కకి తోసి ఎగబడే ఖర్మ అల్లా నాకు రాసాడు' అని అస్పోర్ ఈ మెయిల్లో చదివాక ఆ రోజంతా నాకు ఆకలి చచ్చిపోయింది" ఖాలెద్ కంఠం రుద్ధమైంది.

ఆద్య అతని భుజమీద అనునయంగా తట్టింది.

"మా అమ్మ చెల్లెలు, ఆవిడ కుటుంబ సభ్యులు గ్రీస్, మసెడోనియా మధ్య సరిహద్దుకి చేరుకున్నారు. కాని బార్బడ్‌వైర్ కంచెతో దాన్ని మూసేసారు. స్లోవేనియా, క్రొయేషియా, సెర్బియాల్లోకి వారు విధించిన కొత్త నిర్బంధాలవల్ల వెళ్లలేక నలభై ఒక్కవేలమంది కాందిశీకుల కేంప్‌లో ఉండిపోయారు" ఖాలెద్ సిరియానించి వారు వెళ్ళిన యూరప్‌లోని దారిని మేప్‌లో పాయింటర్‌తో చూపిస్తూ చెప్పాడు.

లేప్‌టాప్‌లో చిన్న వీడియోని ప్లే చేసాడు. ఓ ఆరేళ్ళ పిల్ల ఇలా అమాయకంగా చెప్పింది.

"నేను మా ఊరు తిరిగి వెళ్ళాక ఇరుగు పొరుగు ఇళ్ళకి వెళ్ళి పిల్లలతో ఆడుకుంటాను. పార్క్‌లో ఎప్పటిలా మా ఫ్రెండ్స్‌తో ఆడుకుంటాను. స్కూల్‌కి వెళ్తాను."

సర్వనాశనమైన ఆ ఊరిని తర్వాత చూపించారు. నేరేటర్ కంఠం వినిపించింది. 'చిన్న పిల్లలకి ఏం జరుగుతోందో అర్థంకాదు. తిరిగి ఇంటికి వెళ్తామనే ఆశ వారిలో ఉంది. తన ప్రియురాలికి రాసి, పోస్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్న ఈ ఉత్తరం మరణించిన ఓ సైనికుడి జేబులో దొరికింది.'

అరబిక్‌లోని ఆ ఉత్తరం కింద ఇంగ్లీష్ అనువాదం ఉంది. 'యుద్ధం ముగిసాక మనం పెళ్ళి చేసుకుందాం. అప్పుడు మన నేలలో నీలాంటి అందమైన పూలు మొలుస్తాయి. అప్పుడు సిరియా నందనవనమై తోటలు మొలకెత్తినట్లుగా, నీ గర్భం నించి అందమైన అమ్మాయి బయటకి వస్తుంది.'

"మీరు చూసేది అలెప్పోలోని పన్నెండో శతాబ్దపు వరల్డ్ ఫేమస్ ది గ్రేట్ మాక్స్ ఆఫ్ అలెప్పో మినారెట్. దాన్ని ఏప్రిల్ 2013న కూల్చేయడంతో రెండువేల ముక్కలైంది. తొమ్మిది వందల సంవత్సరాల క్రితం నిర్మించబడ్డ అది చాలా యుద్ధాలని, భూకంపాలని చూసింది. ప్రభుత్వ టేంక్స్ దాన్ని కూల్చేసాయని జబత్ – అల్ అసాద్ అనే అల్ ఖైదాతో సంబంధంగల ఉగ్రవాదులు పేర్కొంటే, వాళ్ళే డైనమేట్‌తో పేల్చేసారని వీళ్ళు ఆరోపించారు."

లేప్‌టాప్‌లో ఓ ఫోటోని చూపించాడు. సముద్రం ఒడ్డున ఇసకలో బోర్లా పడున్న ఓ ముచ్చటైన పిల్లవాడి శవం కనిపించింది.

"అరె పాపం! ఎంత ముద్దుగా ఉన్నాడో" ఆద్య సగం లేచి చెప్పింది.

"వీడి పేరు అలన్ కుర్ది. మూడేళ్ళు. సిరియన్ కుర్దిష్ బాయ్. యూరప్‌కి చేరుకోడానికి వాడి కుటుంబం ప్రయాణించిన పడవ మునిగిపోయి టర్కీలోని బోర్డూం సముద్రతీరానికి వాడి శవం కోట్టుకొచ్చింది. టర్కిష్ జర్నలిస్ట్ నీలోఫర్ డెమిర్ ఆ కుర్రాడి ఫోటో తీసాడు. సెప్టెంబర్ 2015న ఇది ప్రచురించబడి త్వరలో ఇది ప్రపంచ పత్రికలన్నింటి హెడ్‌లైన్స్‌లోకి వెళ్ళి, నీకు వచ్చిన స్పందనే అంతర్జాతీయంగా ప్రజల్లో వచ్చింది. ఈ ఫోటో ప్రజల్లో ఎంత సానుభూతిని కలిగించిందంటే, అది ప్రచురించబడ్డ ఇరవై నాలుగు గంటల్లో వలసదారులు, శరణార్థుల సహాయార్థం అమెరికా, కెనడా, యూరప్ ప్రజలు విరాళాలని కురిపించారు. తమ దేశంలోకి వలసదారులని ప్రజలు ఆహ్వానించారు. వాడి కుటుంబం కెనడాకి బయలుదేరింది. కాబట్టి 2015 కెనడా ఎన్నికల్లో శరణార్థులు ఓ ప్రధాన అంశమైంది. అది వేరే సంగతి అనుకోండి."

"ఈ ఫోటోలో ఏమిటి ఈ టేంకర్ మీద రాసారు?" అతను మరో ఫోటో చూపిస్తే చైత్ర అడిగింది.

"ఇదా? నేను మృత్యువుకి భయపడను. కాని నేను ప్రేమించేవారి కన్నీటికి భయపడుతున్నాను. ఈ ఆయిల్ ఫీల్డ్స్ పక్కనే అండర్‌గ్రౌండ్ సెల్స్ ఉన్నాయి. సివిలియన్స్‌ని ఉగ్రవాదులు అందులో ఉంచి పైన తలుపు మూసేస్తారు. వారు ఎగిరినా అందుకోలేనంత ఎత్తులో ఉంటాయి ఆ రేకు తలుపులు. ఆహారం అందులోకి పడేస్తారు. అన్నీ అందులోనే."

"అబ్బా! నరకం" ఆద్య వెంటనే చెప్పింది.

"తాము ఆ నరకంలో ఉండలేమని చెపితే, బయటకి తెచ్చి కాల్చి చంపుతారు. ప్రాణాలు ముఖ్యం అనుకుని దాన్ని భరించారు తప్ప వందమందిలో ఒక్కరు కూడా బయటకి వస్తామని అన్నవారు లేరు. ఓ రోజు వర్షం భారీగా కురిసి కింద గోయి నిండి నీళ్ళల్లో మునిగి మరణించారు."

"హారిబుల్" ఆద్య భయంగా చెప్పింది.

కూలిన కొన్ని బిల్డింగ్స్‌ని చూపించి ఖాలెద్ చెప్పాడు.

"ఇది డమాస్కస్‌కి తూర్పువైపు జరమనాపేట. మా ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్స్‌పాల్ ఇల్లిది. ఆయన సున్నీ అని షియా సైనికులు బయటకి పిలిచి కాల్చి చంపారు. సిరియన్ రాజధాని కోసం జరిగిన పోట్లాటకు ఇది నిదర్శనం."

అతను చూపించిన ఫోటోల్లో బాంబింగ్ దాడులకి గురైన బిల్డింగ్‌లలోంచి స్టీల్ చువ్వలు వేలాడుతూ కనిపిస్తున్నాయి. వాటికి సిమెంట్ పెళ్ళలు.

"ఇది మరో ఏరియా డుకానియా. నేను తరచు నా మిత్రుడి ఇంటికి వెళ్ళిన ప్రాంతం ఇది. ఓసారి ఈ ప్రాంతం తిరుగుబాటుదార్ల ఆధీనంలోకి వెళ్ళి, నేడు తిరిగి సిరియన్ ప్రభుత్వం ఆధీనంలోకి వెళ్ళింది. సరిగ్గా ఇక్కడే నా పెళ్ళైంది" ఖాలెద్ ఓ శిథిలాన్ని చూపించి చెప్పాడు.

"వెరీ సారీ" ఆద్య చెప్పింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

www.anandbooks.com
www.telugubooks.in